13న లోక్ అదాలత్

చిక్కబళ్ళాపుర, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): చిక్కబళ్ళాపుర జిల్లాలోని వివిధస్థాయి కోర్టులలో పెండింగ్‌లో ఉన్న పలు కేసులను పరిష్కరించేలా ఈనెల 13న జాతీయ లోక్ అదాలత్ జరగనుంది. నగరంలోని కోర్టు హాలులో జిల్లా న్యాయసేవా ప్రాధికార సంస్థ ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ న్యాయమూర్తి వీరభద్రయ్య మీడియాతో మాట్లాడుతూ అదాలత్‌లో కక్షిదారులు పాల్గొని రాజీ చేసుకోవడానికి వీలవుతుందన్నారు. నెగోషియబుల్, ప్రి లిటిగేషన్ కేసులను పరిష్కరించే అవకాశం ఉందన్నారు.

వారంలో పరిహారం

● కృష్ణా ఎగువ ప్రాజెక్టు బాధితులందరికీ న్యాయం ● కోర్టుకు వెళ్తే ఆలస్యం అయ్యే అవకాశం : సీఎం సిద్దరామయ్య ● ఆల్మట్టికి వాయనం సమర్పణ


కృష్ణమ్మకు వాయనం సమర్పిస్తున్న సీఎం, డీసీఎం

బెంగళూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): కృష్ణా ఎగువ ప్రాజెక్టు మూడో విడతకు సంబంధించి వారంరోజుల్లో ధర నిర్ణయిస్తామని, రైతులు ఎవరూ పరిహారంలో అన్యాయం జరిగిందని కోర్టుకు వెళ్లరాదని ఆ స్థాయిలో సహకరిస్తామని సీఎం సిద్దరామయ్య తెలిపారు. రైతులు కోర్టుకు వెళ్తే పనులు జాప్యం అవుతాయని హితవు పలికారు. జలవనరులశాఖ, కృష్ణాజలభాగ్యమండలి శనివారం ఏర్పాటు చేసిన విజయపుర జిల్లా ఆల్మట్టిలోని లాల్‌బాహదూర్ జలాశయానికి గంగపూజ, వాయనం సమర్పణ కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ కృష్ణా ఎగువ ప్రాజెక్టుకు సంబంధించి రైతు పోరాట నేతలతో గతంలోనే బెళగావిలో సభ జరిపామన్నారు. అక్కడ అందరూ అంగీకరించిన మేరకే ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఇటీవలే డీసీఎం కూడా ఈ ప్రాంత రైతులు, ఎమ్మెల్యేలతో చర్చలు జరిపారని ఒప్పందానికి సానుకూలమైందన్నారు. మరో వారం రోజుల్లో పరిహార నిధిని ప్రకటిస్తామన్నారు. గెజిట్ ఆదేశాలకు అనుగుణంగా ఆయకట్టు పెంచితే అనుకూలం కానుందన్నారు. కృష్ణా ఎగువ ప్రాజెక్టు మూడోదశలో 519.6 మీటర్ల నుంచి 524.25 మీటర్లకు ఎత్తు పెంచడం ద్వారా 130 టీఎంసీల నీటిని నిల్వ ఉంచుకోవచ్చునన్నారు. తద్వారా 173 టీఎంసీల నీటిని 6.6 లక్షల హెక్టార్ల సాగుకు అనుకూలం కానుందన్నారు. ఎత్తు పెంచడం ద్వారా ముంపునకు గురయ్యే ప్రాంతాలలో భూపరిహారంతోపాటు అన్ని విధాలా నష్టపరిహారం అందిస్తామన్నారు. గెజిట్ జారీ కాలేదని త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు. సాగునీటికి మేం ప్రాధాన్యత ఇస్తామని ఈ విషయమై ఢిల్లీలో కేంద్ర మంత్రులు, ప్రధానమంత్రిని కలిశామన్నారు. డీసీఎం ఐదుసార్లు మంత్రులను కలిశారన్నారు. సాగునీటికి ప్రాధాన్యత ఇవ్వాలని, రైతులకు అనుకూలం ఇవ్వాలని, భూములకు నీరు సమకూర్చడం ద్వారా పంట ఉత్పత్తులు పెంచడం మా ఆశయమన్నారు. కృష్ణాభాగ్య జల మండలి విజయపుర, బెంగళూరులలో ఉన్నా ఇక్కడివారికి న్యాయం చేయాలనేది మా ఆశయమన్నారు. రాష్ట్రంలో ప్రతి జిల్లాకు మెడికల్ కళాశాల ఏర్పాటు మా లక్ష్యమన్నారు.

మానవత్వంతో ఆదుకుంటాం : డీసీఎం

డీసీఎం డీకే శివకుమార్ మాట్లాడుతూ ఆల్మట్టి ఎత్తు పెంచడం ద్వారా ముంపునకు గురయ్యే ప్రాంతాల ప్రజలను మానవత్వంతో ఆదుకోవాలనేది మా ఆశయమన్నారు. కేంద్రప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు.

కోర్టు నిర్ణయం తీసుకుంటుంది: సీఎం

కాగా బుకర్‌ప్రైజ్ విజేత బానుముస్తాక్ దసరా ఉత్సవాల ప్రారంభం విషయమై హైకోర్టులో మాజీ ఎంపీ ప్రతాప్‌సింహ పిటిషన్ దాఖలు చేసిన అంశంపై సీఎం స్పందిస్తూ కోర్టు తీర్మానిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో నిసార్ అహ్మద్ ఉత్సవాలు ప్రారంభించలేదా అని ప్రశ్నించారు. టిప్పుసుల్తాన్, మిర్జ్ ఉస్మాయిల్ ఊరేగింపులను ఎందుకు వ్యతిరేకించలేదన్నారు. కేవలం బీజేపీ రాజకీయ దురుద్దేశంతోనే వ్యతిరేకిస్తోందన్నారు. మరో ప్రశ్నకు సమాధానంగా బ్యాలెట్ పేపర్ ద్వారా ఎన్నికలకు సిఫారసు చేశామన్నారు. కార్యక్రమంలో మంత్రులు ఎంబీ పాటిల్, శివానందపాటిల్, ఎమ్మెల్యే హెచ్‌వై మేటి, విజయపుర ఎమ్మెల్యేలు, స్థానిక నాయకులు భాగస్వాములయ్యారు.


సమావేశంలో ప్రసంగిస్తున్న సీఎం సిద్దరామయ్య

పెళ్లి చేసుకుంటానని నమ్మించి
అత్యాచారం 7
● న్యాయవాది ఫిర్యాదుతో కానిస్టేబుల్ అరెస్ట్



ఆయువు తీస్తున్న అప్పులు

● రెండున్నరేళ్లలో 2,422 మంది రైతుల ఆత్మహత్య

పదేళ్లలో ఆత్మహత్యకు పాల్పడిన రైతులు

సంవత్సరం	ఆత్మహత్యలు	పరిహారానికి అర్హులు
2015-16	1,525	1,062
2016-17	1,203	932
2017-18	1,323	1,052
2018-19	1,084	866
2019-20	1,091	895
2020-21	851	716
2021-22	859	702
2022-23	968	849
2023-24	1,250	1,082
2024-25	1,082	920
2025-26 (ఏప్రిల్ నుంచి జూలై దాకా)	90	65
మొత్తం	10,461	9,141


ఏడాది	ఆత్మహత్యలు	పరిహారానికి అర్హులు	మొత్తం
2023-24	1,250	1,082	54.10 కోట్లు
2024-25	1,082	920	40.75 కోట్లు
2025-26	90	65	3.25 కోట్లు
మొత్తం	2,422	2,067	98.10 కోట్లు

● సాగులో నష్టాలతో తీవ్రమైన రుణభారం ● తీర ప్రాంత జిల్లాల్లోనే అధికం
● వెయ్యి మందిలో ఒకరు బలవన్మరణం ● 2,067 కుటుంబాలకు పరిహారం
● సగానికి పైగా అనర్హులుగా తేలుస్తున్న ప్రభుత్వం

బెంగళూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పంటల సాగుతోనే భవిష్యత్తుపై ఆశలు పెట్టుకునే అన్నదాతలు అతివృష్టి, అనావృష్టితోపాటు చేతికొచ్చిన పంట గిట్టుబాటుధర లభించకపోతే అప్పులభారం మోయలేమని అర్ధాంతరంగా అశువులు బాస్తున్నారు. రాష్ట్రంలో పదేళ్ల వ్యవధిలో 10వేలమంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. కేవలం రెండున్నరేళ్ల వ్యవధిలోనే 2,422మంది రైతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. రాష్ట్రప్రభుత్వ గణాంకాల ద్వారానే 2422మంది అన్నదాతలు ఆత్మహత్యకు పాల్పడినట్టు తేలుస్తున్నాయి. బ్యాంకులు, సహకారసంఘాలలో చేసిన అప్పులు అన్నదాతల మృతితో మాఫీ అవుతున్నా చేబదులుగా తీసుకున్నా, యాప్‌లు, మైక్రోఫైనాన్స్‌లతోపాటు వడ్డీ వ్యాపారులనుంచి ప్రామిసరీ నోటు రాసి పొందిన అప్పులు మాత్రం మృతి చెందిన రైతు కుటుంబీకులకు భారం అవుతోంది. ప్రభుత్వం ఇచ్చే పరిహారం పెంచాలనే డిమాండ్ దశాబ్దకాలంగా కొనసాగుతోంది. పదేళ్లనుంచి రాష్ట్రంలో సరాసరిన వెయ్యిమంది ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. 2023-24 నుంచి 2025 జూన్ దాకా సుమారు రెండున్నరేళ్ల వ్యవధిలో 2,422 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఆత్మహత్యకు పాల్పడిన అన్నదాతల్లో చాలామంది పంటలసాగు, బోరుబావుల తవ్వకం వంటివాటికి చేసిన అప్పులు భారమై సమాజంలో మర్యాదకు భంగం ఏర్పడుతుందనే ఆత్మహత్య చేసుకుంటున్నారు. 2015-16 నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరం దాకా 10371 మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇటీవలి రెండున్నరేళ్లలో 2,422మంది రైతులు ఆత్మహత్య చేసుకోగా వారిలో 2,067మంది చేసిన అప్పులు చెల్లించలేకనే ఆత్మహత్య చేసుకున్నట్టు నిర్ధారణ అయ్యింది.

ప్రభుత్వ గణాంకాల ప్రకారం హావేరి జిల్లాలో అత్యధికమంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. హావేరి జిల్లాలో 2023-24 నుంచి ఇప్పటివరకు 260మంది రైతులు ఆత్మహత్య చేసుకోగా వారిలో 228మందికి పరిహారం దక్కింది. రెండోస్థానంలో బెళగావిలో 218మంది ఆత్మహత్య చేసుకోగా వీరిలో 184మంది కుటుంబాలకు పరిహారం లభించింది. కోలారు జిల్లాలో రెండున్నరేళ్లలో కేవలం ఒకరు మాత్రమే ఆత్మహత్యకు పాల్పడ్డారు. చిక్కబళ్ళాపురలో నలుగురు, చామరాజనగర్‌లో ఆరుగురు, రామనగరలో 10మంది, దక్షిణకన్నడలో 11మంది, కొడగులో 12మంది ఆత్మహత్యకు పాల్పడ్డారు. మలెనాడు, తీరప్రాంత జిల్లాల్లో ఆత్మహత్యకు పాల్పడిన అన్నదాతలు కొంత తక్కువగానే ఉన్నారు.

2023-24 నుంచి 2025 జూలై దాకా ఆత్మహత్యకు పాల్పడిన 2422 మంది రైతులపైకి 2067మంది రైతుల కుటుంబాలకు పరిహారాన్ని పంపిణీ చేశారు. ప్రతి రైతు కుటుంబానికి 5 లక్షల రూపాయల చొప్పున 98.10 కోట్ల రూపాయలు అందచేశారు. గత పదేళ్లను పరిశీలిస్తే రైతుల ఆత్మహత్యలు ఎక్కడా తక్కువ కాలేదు. 2015-16 నుంచి 2025 దాకా 10,371మంది ఆత్మహత్య చేసుకున్నారు. దీని ప్రకారం ఏడాదికి సగటున వెయ్యిమంది ఆత్మహత్య చేసుకున్నట్టే అయ్యింది.


కంప్లిలో ఇటీవల వర్షాలకు నీట మునిగిన పంటలు(ఫైల్)

సైమా వేదికపై కన్నడిగులకు అన్యాయం

● అవార్డు అందుకున్న వేళ నటుడు దునియా విజయ్ ఆవేదన


అవార్డు అందుకుంటున్న దునియా విజయ్

బెంగళూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్ (సైమా) అవార్డుల ప్రదానంలో కన్నడిగులకు అన్యాయం అంటూ ప్రముఖ నటుడు దునియా విజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దుబాయ్‌లో జరిగిన వేడుకలలో అవార్డు పొందిన తర్వాత దునియా విజయ్ మాట్లాడుతూ సైమా నిర్వాహకుల పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏటా కన్నడిగులకు సైమా పురస్కారాల వేళ తక్కువ చేస్తున్నారని ఆరోపించారు. 2024 సంవత్సరానికి సంబంధించి సైమా పురస్కారాలు ప్రదానం చేశారు. దక్షిణ భారత కళాకారులు, సాంకేతిక నిపుణులకు పురస్కారాలు అందచేశారు. భీమ చిత్రానికి పురస్కారం అందుకున్న వేళ దునియా విజయ్ మాట్లాడుతూ అన్ని భాషల నటులు, సాంకేతిక నిపుణులకు అవార్డులు ఇచ్చిన తర్వాత చివరగా కన్నడిగులకు ఎంపిక చేస్తారన్నారు. అప్పటికి సందర్శకులు, తోటి నటులందరూ వెళ్లిపోయి ఉంటారన్నారు. కేవలం అవార్డు తీసుకోవడమే సరిపోతుందని, మిగిలినవారు ఎవరూ ఉండడం లేదన్నారు. సభికులు అందరూ ఉన్నప్పుడే కన్నడిగులకు అవార్డులు ఇవ్వాలన్నారు. దునియా విజయ్ వ్యాఖ్యలపై శాండల్‌వుడ్ నటులు మద్దతు ఇచ్చారు.

లైసెన్స్ హోమియోపతి..వైద్యం అల్లోపతి 8
● నకిలీ క్లినిక్‌పై అధికారుల దాడులు


కంప్లిలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు


సిరుగుప్పలో మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప

8
ఘనంగా గణేశ్ నిమజ్జనం
● కంప్లి, సిరుగుప్పలో 11వ రోజు గంగమ్మ ఒడికి చేరిన గణనాథుడు


కెలవరపల్లి డ్యాం నుంచి వస్తున్న నీరు

కెలవరపల్లి డ్యాం నుంచి నీటి విడుదల

హోసూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): థెన్‌పెన్నై నదీ పరీవాహక ప్రాంతంలో కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా కెలవరపల్లి డ్యాంలోకి నీటిమట్టం పెరిగింది. శుక్రవారం 1009 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా శనివారం 1230 క్యూసెక్కులకు పెరిగింది. ఆనకట్ట సామర్థ్యం 44.28 అడుగులు ఉండగా ప్రస్తుతం 41 అడుగులకు చేరింది. గతంతో పోలిస్తే మూడు రోజులుగా డ్యాం నుంచి విడుదల అవుతున్న నీటిలో రసాయన వ్యర్థాలు తక్కువగా ఉండడంతో నురుగు తక్కువగా ఉందని స్థానికులు అంటున్నారు. నీటి ప్రమాణం పెరగడంతోనే వ్యర్థాల ప్రభావం తగ్గిందని తెలుస్తోందన్నారు. కాగా రసాయన వ్యర్థాలు చేరకుండా సమర్థవంతంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సర్కారు బడుల్లో చదివే వారికే గ్యారెంటీలు..?

● మాయకొండ ఎమ్మెల్యే బసవంతప్ప



బెంగళూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అధికార కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో మరో నేత వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. ఇప్పటికే మంత్రులు, నేతల మాటలతో వివాదాలు చుట్టుముట్టుకున్న సంగతి తెలిసిందే. కాంగ్రెస్ పార్టీ శాసనసభ ఎన్నికల ముందు ఐదు గ్యారెంటీల హామీలు ప్రచారం చేసి అధికారంలోకి వచ్చారు. ఇలా 2023 నుంచి ఐదు గ్యారెంటీలను ప్రారంభించారు. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల కరెంటు ఉచితం అని ప్రకటించి అధికారంలోకి వచ్చాక ఏడాది వినియోగం సరాసరి అంటూ అమలులోకి తెచ్చారు. ఇప్పుడు కూడా 2022-23 సరాసరి యూనిట్ ప్రకారమే గృహజ్యోతి వర్తిస్తోంది. శక్తి గ్యారెంటీ ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం కల్పించారు. గృహలక్ష్మి గ్యారెంటీ ద్వారా కుటుంబ పెద్దకు నెలకు 2వేలు, అన్నభాగ్య పథకం కింద తొలుత 5 కేజీల బియ్యానికి నగదు బదిలీ చేసినా ప్రస్తుతం మాత్రం బియ్యం ఇస్తున్నారు. ఐదు గ్యారెంటీ పథకాలకు ఏడాదికి 56వేల కోట్ల రూపాయలు ఖర్చు అవుతోంది. రెండేళ్ల పాలన ముగిసింది గ్యారెంటీలు నిర్విరామంగా అమలు చేస్తున్నామని ప్రభుత్వ పెద్దలు గొప్పలు చెబుతున్నా గ్యారెంటీల ద్వారా అభివృద్ధి కుంటుపడిందని ప్రతిపక్ష సభ్యులే కాకుండా సొంత పార్టీ ఎమ్మెల్యేలు బహిరంగ ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఇలా విమర్శలు కొనసాగుతున్న తరుణంలోనే అధికార కాంగ్రెస్‌కు చెందిన మాయకొండ ఎమ్మెల్యే కేఎస్ బసవంతప్ప తాజాగా చేసిన ఆరోపణలు హల్‌చల్ చేస్తున్నాయి. గురుపూజోత్సవం సందర్భంగా మాట్లాడుతూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తే మాత్రమే ఐదు గ్యారెంటీలు వర్తింప చేస్తే బాగుంటుందని వ్యాఖ్యానించారు. జిల్లా కేంద్రమైన దావణగెరెలోని శామనూరు శివశంకరప్ప పార్వతమ్మ కల్యాణమండపంలో మాట్లాడిన వేళ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతోందని ప్రభుత్వం పరిష్కార మార్గంగా ఓ చొరవ చూపాలన్నారు. ఐదు గ్యారెంటీల ప్రయోజనాలు పొందుతున్నవారు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్న నిబంధన ఉంచాలన్నారు. తద్వారా ప్రభుత్వ పాఠశాలల మనుగడ సాధ్యమని అటువంటి వారికే గ్యారెంటీ పథకాల ఎంపికకు తొలి ప్రాధాన్యం ఉండాలన్నారు. అయితే ఈయన మాటలపై బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

భక్తులతో కిటకిటలాడిన ఖాద్రీశుడి ఆలయం



స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులు

కదిరి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయం భక్తులతో శని వారం కిటకిటలాడింది.. స్వామివారి దర్శనానికి భక్తులు ఉదయం నుంచే క్యూలైన్లలో బారులు తీరారు. తెలుగు రాష్ట్రాలనుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శం చుకోవడానికి శుక్రవారం రాత్రే ఆలయా నికి చేరుకు న్నారు. దీంతో ఆలయ సమీప ప్రాంతాల్లో సందడి నెలకొంది.

నేడు చంద్ర గ్రహణం

ఉమ్మడి జిల్లాలో మూతపడనున్న ఆలయాలు

న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): సంపూర్ణ చంద్ర గ్రహణం ఏర్పడనున్న నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ఉన్న ఆలయాలన్నీ ఆదివారం మధ్యాహ్నం నుంచే మూతపడనున్నాయి. భారత కాలమానం ప్రకారం ఆది వారం రాత్రి 9.50 గంటలకు గ్రహణ స్పర్శకాలం, 10.58 గంటలకు ఉన్మీలన కాలం, 11.41 గంటలకు నిమీలన కాలం, రాత్రి 1.31 గంటలకు గ్రహణ మోక్ష కాలం, 8న తెల్లవారుజామున 3.41 గంటలకు ఆద్యంత పుణ్యకాలంతో గ్రహణం వీడనుంది. ఈ నేపథ్యంలో కదిరిలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం, నార్పల మండలంలోని గూగూడు కుళ్లాయిస్వామి, ఆంజనేయస్వామి దేవాలయాలు, బొమ్మనహాళ్ మండలంలోని నేమకల్లు ఆంజనేయ స్వామి ఆలయం, లేపాక్షి దుర్గా వీరభద్రస్వామి ఆలయం, కసాపురం ఆంజనేయస్వామి ఆలయం, మురడి ఆంజనేయస్వామి ఆలయాలను మూసివేయనున్నట్లు ఆయా ఆలయాల అధికా రులు, అర్చకులు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 1గంట నుంచి మూసి వేసి, సోమవారం ఉదయం ఆలయ శుద్ధి, సంప్రోక్షణ, పూజల అనంతరం భక్తులకు దైవ దర్శనం చేయించనున్నట్లు అధికారులు తెలిపారు.



హుండీ సొమ్మును లెక్కిస్తున్న సేవా సమితి సభ్యులు

హుండీ ఆదాయం రూ.33.75 లక్షలు

ఉరవకొండ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీ నరసింహస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించారు. కర్నూలు జేవీవీ కార్యాలయం అధికారి మాధవస్వామి, ఆలయ ఇన్‌చార్జి ఈవో తిరుమల రెడ్డి పర్యవేక్షణలో హుండీలను తెరచి సొమ్మును లెక్కించారు. 110రోజులకు రూ.33,75,028లుఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. అలాగే 12గ్రాములు బంగారం, 697గ్రాములు వెండి వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ రేగాటి నాగరాజు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

మళ్లీ వెరిఫికేషన్

- డీఎస్సీ-2025లో బోగస్‌ల నివారణకు చర్యలు
- రేపు ఇతర జిల్లా బృందాలతో పరిశీలన

అనంతపురం విద్య, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025కు సంబంధించి అభ్యర్థుల సర్టిఫికె ట్లను రీ వెరిఫికేషన్ చేయనున్నట్లు సమాచారం. గత నెల 28, 29న కమిటీ బృందాలు 770మంది సెలెక్టెడ్ అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. ఆరోపణలు వస్తుండటంతో వాటిని మళ్లీ పరిశీ లించాలని రాష్ట్ర అధికారులు ఆదేశించారు. దీంతో డీఈఓ ప్రసాద్‌బాబు పర్యవేక్షణలో ఈనెల 4న రీవెరిఫికేషన్ చేయించారు. అప్పుడు కూడా రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి అనేక రిమా ర్క్‌లు వచ్చాయి. అనంతపురం జిల్లా నుంచి కూడా ఆరుగురు అభ్యర్థుల ఎంపిక సమాచారా లపై రిమార్కులు వచ్చాయి. వీటిపై రాష్ట్ర కమిష నర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ, కొన్నిజిల్లాల డీఈ ఓలకు షోకాజ్‌లు, చార్జ్‌మెమోలు ఇచ్చినట్లు సమాచారం. అలాగే ముందుగా పరిశీలించిన బృందసభ్యులతో కాకుండా మరో కమిటీతో సర్టిఫి కెట్లు వెరిఫికేషన్ చేయించాలని ఆదేశించారు. దీంతో ఈనెల 5న జిల్లా విద్యాశాఖ కార్యాల యంలో రీ వెరిఫికేషన్ చేయించారు. అపుడు కూడా అనేక రిమార్కులు బయటపడ్డాయట.



సర్టిఫికెట్లను రీ వెరిఫికేషన్ చేస్తున్న కమిటీ బృందం


అనంతపురం జిల్లాలో కూడా మరో ఐదుగురు అభ్యర్థుల సమాచారంలో రిమార్కులు బయటప డ్డాయని విద్యాశాఖ యంత్రాంగం వెల్లడించింది. ఓ జిల్లాలో కమిటీలో ఉన్న ఓ ఎంఈఓ ముంద స్తుగా డబ్బులు మాట్లాడుకొని బోగస్‌లకు అండగా నిలిచి, తప్పుడు సర్టిఫికెట్లు పెట్టినా, అన్నీ సక్రమంగా ఉన్నట్లు పరిశీలన చేసి అప్ లోడ్ చేసి పంపారట. అయితే ఆధారాలతో దొర కిపోవడంతో ఆ ఎంఈఓను సర్వీస్ నుంచి తొల గించేందుకు కమిషనర్ ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

ఇతర జిల్లా బృందాలతో ..

ఇప్పటివరకు జిల్లాలో ఏర్పాటు చేసిన పరిశీలన బృందాలతోనే డీఎస్సీ అభ్యర్థులు అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టారు. జిల్లాలో పలు వురు నకిలీల వ్యవహారాలు, డ్రామాలు వెలుగు లోకి వచ్చాయి. ఇప్పటికే ఈడబ్ల్యూఎస్, పీహెచ్, స్టడీ, కుల సర్టిఫికెట్లపై విమర్శలు రావడంతో దాదాపు 20కి పైగా అభ్యర్థులను పెండింగ్ పెట్టారు. కొందరిని రిజెక్ట్ చేసి వారి స్థానంలో కొత్తవారికి అవకాశం కల్పించారు. ఇంకా కొందరి సర్టిఫికెట్ల పై రెవెన్యూ, ఇతర శాఖల నుంచి స్పష్టత రావాల్సిఉంది. ఈ నేపథ్యంలో ఇతర జిల్లా బృందాలతో అభ్యర్థుల సర్టిఫికెట్లను రీవెరి ఫికేషన్ చేయిస్తున్నట్లు సమాచారం. సోమ వారం ఇతర జిల్లా కమిటీలు అనంతపురం జిల్లా కు వచ్చే అవకాశం ఉందని, వారిద్వారా మళ్లీ సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందని డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు. దీంతో అభ్యర్థుల కన్నా విద్యాశాఖ అధికారులు, సిబ్బందే ఎక్కువగా టెన్ష న్ పడుతున్నారు.

తపాలా శాఖలో ఉపకార వేతనాలు

- 6 నుంచి 9వ తరగతి విద్యార్థులు అర్హులు
- దరఖాస్తుకు ఈనెల 16 వరకూ గడువు



దీన్ దయాళ్ యోజన ఉపకార వేతన వివరాల కరపత్రిక

ఉరవకొండ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): నేటి తరం విద్యార్థుల్లో సృజనాత్మకత, జిజ్ఞాసను పెంపొందించేందుకు తపాల శాఖ దీన్ దయాళ్ స్పర్శ యోజనా పేరిట పోటీ పరీక్షలు నిర్వహిస్తోంది. చరిత్ర, క్రీడలు, విజ్ఞానం, సమకాలీన అంశాలు, సంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడమే దీని ఉద్దేశ్యం. తపాల బిళ్లల సేకరణ, అధ్యయనంతో కలిగే ప్రయోజనాలు వివరించేందుకే ఏటా ఈ పోటీలు నిర్వహి స్తున్నట్లు తపాలా శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ ఉప కార వేతనాల పరీక్షను సద్వినియోగం చేసుకోవాలని చెబుతు న్నారు. వివరాలకు అనంతపురం ప్రధాన తపాల కార్యాలయంలో సంప్రదించాలని సూచిస్తున్నారు.

రెండు దశల్లో ఎంపిక

మొదట స్ర్కీనింగ్ పరీక్ష ఉంటుంది. దీనిలో జనరల్ నాలెడ్జ్, స్టాంపులు, వర్తమాన అంశాల నుంచి 50 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఉంటాయి. ఉత్తీర్ణులైన విద్యార్థులు రెండో దశలో ప్రాజెక్టు వర్క్ చేయాలి. ఇందులో జంతువులు, పక్షులు, ప్రదేశాలు, పూలు, సంగీతం విభాగాల్లో ఒక అంశాన్ని ఎంచుకుని ప్రాజెక్టు వర్క్ పూర్తి చేయాలి. పూర్తయిన ప్రాజెక్టును విజయవాడ తపాల శాఖ సర్కిల్ కార్యాలయానికి పంపాలి.

దరఖాస్తుల స్వీకరణ

విద్యార్థులు పాఠశాల ప్రధానోపాధ్యాయుడి ద్వారా ఈ నెల 16వ తేదీ లోపు అనంతపురంలోని తపాల శాఖ ప్రాంతీయ కార్యాల యానికి దరఖాస్తులు పంపాలి. తపాల శాఖలో రూ.200 చెల్లించి, విద్యార్థి పేరుతో లేదా ప్రధానోపాధ్యాయుడి పేరుమీద ఫిలాటలి ఖాతా, ఫిలాటలి క్లబ్ ఖాతా తెరవాలి. ఖాతా తెరవగానే రూ.180 విలువ చేసే తపాల బిళ్లలు ఇస్తారు. ఇవి పోటీ పరీక్షలు రాసే వారికి ఉపయోగపడతాయి. పరీక్ష తేదీని తపాల శాఖ వారు హెచ్‌ఎంలకు తెలియజేస్తారు.

ప్రతి నెలా రూ.500 పొందవచ్చు

రెండు దశల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను విజయవాడ తపాల శాఖ సర్కిల్ కార్యాలయం అధికారులు ఎంపిక చేస్తారు. వీరికి ప్రతినెలా రూ.500 చొప్పున, ఏడాదికి రూ.6వేలు ఉపకారవే తనం అందిస్తారు. ఈ సాయం పొందేందుకు విద్యార్థులు తమ పేరు, తల్లిదండ్రుల పేరుతో తపాల శాఖలో జాయింట్ సేవింగ్ ఖాతాను తెరవాల్సి ఉంటుంది.

అనంత కవులకు పురస్కారాలు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన కవులు ఏలూరు యంగన్న, ఒంటెద్దు రామలింగారెడ్డి.. జోళద రాసి చంద్రశేఖరరెడ్డి స్మారక పుర స్కారాలను అందుకున్నారు. బళ్లారి కల్చరల్ యాక్టివిటీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వీరిని పురస్కారాలకు ఎంపిక చేశారు. బళ్లారిలోని బసవ రాజేశ్వరి విద్యాలయం ఆవరణలో శనివారం సాయంత్రం పురస్కార ప్రదానోత్సవ సభ నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు శీలా బ్రహ్మయ్య, సాహితీ ప్రముఖులు వీరికి పురస్కారాలను అందజేసి సత్కరించారు.

ఉద్యోగ విరమణ సత్కారం



ఉద్యోగ విరమణ పొందిన ఎస్ఐ, ఏఎస్ఐలను సత్కరిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో సుదీర్ఘకాలం సేవలు అందించి, ఉద్యోగ విరమణ చేసినవారిని ఎస్పీ రత్న ఘనంగా సత్కరించారు. వారి సేవలను కొని యాడారు. ఉద్యోగ విరమణ పొందిన ఎస్ఐలు కళావతి, శ్రీరాములు, ఏఎస్ఐలు మస్తాన్, వెంకట్రాముడును జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఆమె సత్కరిం చారు. ప్రతి ఉద్యోగికీ విరమణ సాధారణమని, విధులలో ప్రజలకు అందించే సేవలే శాశ్వతమని అన్నారు. శేష జీవితం ఆయురారోగ్యాలతో, కుటుంబ సభ్యులతో కలసి సంతోషంగా జీవించా లని ఆకాంక్షిస్తున్నానని తెలిపారు.

వృద్ధాప్యంలో భరోసా !

- వృద్ధులకు ఆసరాగా పీఎం కిసాన్ మాన్‌ధన్
- ప్రీమియం కడితే 60 ఏళ్లు దాటాక పింఛను





కదిరి అర్బన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలో జీవనోపాధి లేని, ఖర్చులు భరించడానికి కనీస పొదుపు లేని చిన్న, సన్నకారు రైతులకు సామాజిక భద్రత కల్పించే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ మాన్‌ధన్‌తో పింఛన్ యోజన అమలు చేస్తోంది. ఈ పథకం ద్వారా 60 ఏళ్లు దాటిన సన్న, చిన్నకారు రైతులకు ప్రతి నెలా రూ.3 వేలు చొప్పున జీవిత కాలం పింఛను అందుతుంది. ఈ పథకంలో చేరడానికి 40 ఏళ్లలోపు వయసున్న వారు అర్హులు. ఐదె కరాల్లోపు సొంత వ్యవసాయ భూమి గల సన్నకారు, పీఎం కిసాన్ లబ్ధిదారులు వివరాలు నమోదు చేసుకోవచ్చు. పన్ను చెల్లింపుదా రులు, సామాజిక భద్రత పథకాల పరిధిలో ఉన్న వారికి వర్తించదు.

ప్రీమియం ఇలా...

18 నుంచి 40 ఏళ్ల వయసున్న రైతులు ప్రతి నెలా రూ. 55 చెల్లిస్తే కేంద్రం తన వాటాగా మరో రూ. 55 కలిపి మొత్తం రూ. 110 జమ చేస్తుంది. 21 ఏళ్ల వారు రూ.61, 25 ఏళ్ల వారు రూ.80, 30 సంవ త్సరాల వారు రూ.106, 35 ఏళ్లకు రూ.150, 40 ఏళ్ల వారు రూ. 200 ప్రీమియం చెల్లించాలి. 60 ఏళ్ల తరువాత ప్రతి నెలా రూ.3 వేల పింఛన్ లభిస్తుంది. ఆ రైతు మరణిస్తే నామినీగా ఉన్న వారికి ప్రతి నెలా రూ. 1500 పింఛన్ జీవిత కాలం అందుతుంది.

దరఖాస్తు ఇలా

పీఎం కిసాన్ లబ్ధిదారులు సీఎస్‌సీ కేంద్రానికి వెళ్లి పీఎం కిసాన్ కేఎంవై పోర్టల్‌లో దరఖాస్తు చేయించాలి. మొదట ఆధార్, తర్వాత నామినీ వివరాలు దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకొని రైతు సంతకం చేసి అప్‌లోడ్ చేయాలి. అనంతరం పింఛన్ కార్డు వస్తుంది. పీఎం కిసాన్ పథకానికి అనుసంధానమైన బ్యాంకు ఖాతా నుంచి ప్రీమియం చెల్లించాలి.

అవగాహన కల్పిస్తున్నాం



రైతులు వృద్ధాప్యంలో ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఉండేందుకు కేంద్రప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకువచ్చింది. ఈ పథకంపై అవ గాహన కల్పిస్తున్నాం. మీసేవ కేంద్రాల్లో ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు.

- శ్రీహరి నాయక్, ఏఓ, కదిరి

సూపర్ హిట్ సభకు 3500 బస్సులు

- ఆర్టీసీ అధికారులతో మంత్రుల సమీక్ష



బస్సుల ఏర్పాటుపై అధికారులతో సమీక్షిస్తున్న మంత్రులు, ఆర్టీసీ జోనల్ చైర్మన్

అనంతపురం టౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): నగరంలో ఈ నెల 10న నిర్వహించే 'సూపర్ సిక్స్-సూపర్ హిట్' సభను విజయ వంతం చేసేందుకు సమష్టి కృషి చేద్దామని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవి, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పిలుపునిచ్చారు. అనంతపురం బస్టాండు ఆవరణలో వీరు శనివారం సాయంత్రం పర్యటించారు. అనంతరం ఆర్‌ఎం కార్యాలయంలో సమావేశమై, ముఖ్య మంత్రి సభకు బస్సుల సమీకరణ గురించి సమీక్షించారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 3,500 బస్సులను ముఖ్యమంత్రి సభకు కేటా యించేలా చర్యలు చేపడుతున్నట్లు మంత్రులు తెలిపారు. ప్రయాణికులకు ఎక్కడా అసౌకర్యం కలగకూడదని, అవసర మైతే ఇతర జిల్లాల్లో అదనంగా ఉన్న బస్సు లను సర్దుబాటు చేయాలని ఆర్టీసీ అధికారు లను ఆదేశించారు. కార్యక్రమంలో శ్రీ సత్య సాయి జిల్లా ఆర్‌ఎం మధుసూదన్, అనంత పురం జిల్లా ఇన్‌చార్జి ఆర్‌ఎం శ్రీలక్ష్మి, డిప్యూటి సీఎంఈ రమేష్ బాబు, డీఎంలు పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.16వేలు



అనంతపురంరూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో శనివారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 16,500లతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి రాఘవేంద్రకుమార్ తెలి పారు. అలాగే కనిష్ఠంగా రూ.7వేలు, సరాసరి ధర రూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 699 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

ఉండమ్మా.. బొట్టు పెడతాం..!

సూపర్ హిట్ సభకు తెలుగు మహిళల ఆహ్వానం

అనంతపురం క్రైం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): నగరంలో ఈ నెల 10న నిర్వహించే సూపర్ సిక్స్‌సూపర్ హిట్ సభకు రావాలని కోరుతూ నగరంలోని మహిళలను తెలుగు మహిళలు శనివారం ఆహ్వానించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో తిరుగుతూ మహిళ లకు పసుపు రాసి, కుంకుమ బొట్టు పెట్టి మరీ ఆహ్వానిస్తున్నారు. స్థానిక ఆలయాల్లో శనివారం పూజలు నిర్వహించి, ఇంటింటికీ వెళ్లారు. వీరశైవ లింగాయత కార్పొరేషన్ చైర్‌పర్సన్ స్వప్న, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని, తెలుగు మహిళ నాయకురాలు వడ్డే భవాని, రాష్ట్ర రజక సాధికార కమిటీ సభ్యులు శోభ, తెలుగు మహిళ జిల్లా ప్రచార కార్యదర్శి కంఠా దేవి, కార్య దర్శి మహేశ్వరి తదితరులు రజక నగర్‌లోని వినాయకుడి ఆల యంలో పూజలు చేశారు. అనంతరం 48, 42, 41 డివిజన్‌లలోని రజకనగర్, జనశక్తి నగర్, 6వ రోడ్డు ప్రాంతాల్లో ఇంటింటికీ తిరి గారు. సీఎం సభకు రావాలని ఆహ్వానించారు. మాజీ మేయర్ స్వరూప ఆధ్వర్యంలో 45వ డివిజన్‌లో అంగన్‌వాడీ విభాగం అధ్య క్షురాలు దళవాయి రమాదేవి, మాజీ కార్పొరేటర్లు సరళ, భూలక్ష్మీ, తెలుగు మహిళలు చరిత, రమాదేవి, రంగమ్మ, రాణి, వనజ, ఈశ్వ రమ్మ తదితరులు ఇంటింటికీ తిరిగారు. ముఖ్యమంత్రి సభకు రావా లని ఆహ్వానించారు.



బొట్టు పెడుతున్న మాజీ మేయర్ స్వరూప, ఇతర నేతలు



బొట్టు పెడుతున్న స్వప్న, తేజస్విని ఇతర నేతలు

భార్యను హత్య చేసిన భర్త



మోహన్‌తాజ్ (ఫైల్)

గాండ్లపెంట, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): భార్యను రోకలిబండతో కొట్టి చంపిన సంఘటన మండలంలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు మండలంలోని తూపల్లి గ్రామానికి చెందిన మన్సూర్, మెహన్‌తాజ్‌కు (30) 14 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి 12 సంవత్సరాల కుమారుడు నిహార్, 10 సంవత్సరాల కుమార్తె మినహా ఉన్నారు. పిల్లలతో కలిసి మోహన్‌తాజ్ శుక్రవారం దుస్తుల కోసం మదనపల్లికి వెళ్లి, తిరిగి రాత్రి 9గంటలకు స్వగ్రామానికి చేరుకున్నారు. దీనిపై మన్సూర్ తన భార్య మెహన్‌తాజ్‌తో గొడవపడ్డాడు. అందరూ పడుకున్న తర్వాత అర్ధరాత్రి సమయంలో ఇంటిలో నిద్రిస్తున్న భార్య మెహన్‌తాజ్ తలపై రోకలిబండతో మోదాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎన్పీకుంట ఎస్ఐ వలీబాషా తెలిపారు. మృతదేహాన్ని కదిరి కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. మన్సూర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు.

9 మంది ఎంపీడీఓలకు ప్రమోషన్

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) ఉమ్మడి జిల్లాలో 9 మంది ఎంపీడీఓలకు డీడీఓలుగా ఉద్యోగో న్నతి కల్పించారు. వారికి ప్లేస్‌మెంట్స్ ఖరారు చేస్తూ శని వారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఉద్యోగి పేరు	ఎంపీడీఓ ప్రస్తుత స్థానం	డీడీఓగా పోస్టింగ్ స్థానం
శివానందనాయక్	ఏపీడీ మడకశిర	ఏపీడీ హిందూపురం
శకీలా బేగం	శింగనమల	డీవీఓ డ్వామా కర్నూలు
వెంకటరామిరెడ్డి	గాండ్లపెంట	ఏఓ డ్వామా, కడప
రఘునాథగుప్తా	నల్లచెరువు	ఏఓ డ్వామా నెల్లూరు
ఆజాద్	అమడగూరు	ఏపీడీ డ్వామా కమలాపురం
సరస్వతి	హిందూపురం	ఏఓ డ్వామా, కడప
రామక్రిష్ణ	గుమ్మఘట్ట	ఏఓ డ్వామా అనంతపురం
నరేంద్రకుమార్	గోరంట్ల	ఏపీడీ డ్వామా, నంద్యాల
శకుంతల	పెద్దపప్పూరు	ఏపీడీ డ్వామా, కదిరి



సమీక్షలో ప్రజా ప్రతినిధులు, నాయకులు

సంక్షేమం.. అభివృద్ధి డబుల్

అనంతపురం క్రైం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని వెంటిలే టర్‌పైకి తెచ్చిందని, కూటమి ప్రభుత్వం తిరిగి సామాన్య స్థితికి తీసుకొచ్చిందని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఈ నెల 10వ తేదీ జరిగే 'సూపర్ సిక్స్- సూపర్‌హిట్' బహిరంగ సభ ఏర్పాట్లను మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, నారాయణ, రవికుమార్, కొల్లు రవీంద్ర, సవిత, రాంప్రసాద్ రెడ్డి పర్యవే క్షించారు. నగరంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో కలెక్టర్ వినోద్ కుమార్, ఎస్పీ జగదీష్‌తో కలిసి సమీక్షించారు. అనంతరం సాయంత్రం 4.30 గంటలకు బహిరంగ సభ జరిగే ప్రాంతానికి మంత్రులు చేరుకున్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులతో సుమారు గంటపాటు చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఆర్థిక లోటుతో ఉన్న రాష్ట్రాన్ని కేంద్రం సహకారంతో గాడిలో పెడుతున్నామని పయ్యావుల అన్నారు. డబుల్ సంక్షేమం, డబుల్ అభివృద్ధి అందించే స్థితికి రాష్ట్రాన్ని కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిందని అన్నారు. ప్రధాని మోదీ సహకారంతో సీఎం చంద్రబాబు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని అన్నారు. వైసీపీ ప్రభుత్వం రూ.3 వేలు ఫించన్ ఇస్తే తాము రూ.4 వేలు చేశామని, వారు 42 లక్షల మందికి పింఛన్లు ఇస్తే.. తాము 64 లక్షల మందికి ఇస్తున్నామని అన్నారు. రైతు భరోసా రూ.7 వేలు ఇస్తే తాము అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు ఇస్తున్నామని తెలిపారు. పవన్ కల్యాణ్ ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు ఇస్తున్నారని అన్నారు. గత నెల 15న ఎర్రకోట నుంచి ప్రధాని మోదీ మాట్లాడుతూ.... పండుగ రోజుల్లో దీపావళి డబుల్ ధమాకా జరుపుకుంటారని అన్నారని గుర్తు చేశారు. ఆ మాట ప్రకారం జీఎస్టీ కౌన్సిల్ సమావే శంలో సామాన్యు తీసుకునే వస్తులపై జీఎస్టీ తగ్గించారని, కొన్నింటినీ పూర్తిగా ఎత్తివే శారని అన్నారు. ప్రధాని సాహసోపేత నిర్ణయాలకు సీఎం చంద్రబాబు మద్దతు తెలి పారని గుర్తుచేశారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రయిట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

జరుక్ శాస్త్రి (జయంతి)



'జరుక్ శాస్త్రి'గా పేరొందిన జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి 1914 సెప్టెంబరు 7న కృష్ణా జిల్లా బందరులో జన్మించారు. తెలుగు సాహిత్యంలో పేరడీలకు జరుక్ శాస్త్రిని ఆద్యుడిగా భావిస్తారు. ఆంధ్రపత్రిక, వాణి పత్రికల్లో సంపాదకవర్గ సభ్యులుగా పనిచేశారు. ఆయన రచనల్లో కొన్ని 'జరుక్‌శాస్త్రి పేరడీలు', కొన్ని కథలు 'శరత్ పూర్ణిమ' పేరిట నవోదయ పబ్లిషర్స్ సంకలనాలుగా వెలువరించారు. మద్రాస్, విజయవాడ ఆకాశవాణి కేంద్రాలలో స్క్రిప్ట్ రైటర్‌గా పనిచేశారు. 1968 జూలై 20న కన్నుమూశారు.

భానుమతి (జయంతి)



దక్షిణాది ప్రముఖ నటి భానుమతి రామకృష్ణ 1924 సెప్టెంబరు 7న ప్రకాశం జిల్లా ఒంగోలు ప్రాంతం దొడ్డవరం గ్రామంలో జన్మించారు. దర్శకురాలిగా, సంగీత దర్శకురాలిగాను, గాయనిగా, నిర్మాతగా, గేయరచయితగా బహుముఖ ప్రజ్ఞాశాలి. 50ఏళ్లకు పైబడి సినీరంగంలో కొనసాగినా వందకుపైగా తెలుగు, తమిళభాషలలో ఆణిముత్యాల వంటి సినిమాలు ఉన్నాయి. దర్శక నిర్మాత రామకృష్ణారావును వివాహమాడారు. 1966లో 'పద్మశ్రీ' పురస్కారంతో దక్షిణాదిన తొలిమహిళగా నిలిచారు. కళాప్రపూర్ణ, కలైమామణి, గౌరవ డాక్టరేట్, ఇతర జాతీయ, రాష్ట్ర పురస్కారాలు అందుకున్నారు. తెలుగు సినీరంగంలో తొలి మహిళా సూపర్‌స్టార్‌గా గుర్తింపు పొందారు. 30వ ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్‌లో 'ఉమెన్ ఇన్ సినిమా' గౌరవాన్ని అందుకున్నారు. 2005 డిసెంబరు 24న కన్నుమూశారు.

ఉషశ్రీ (వర్ధంతి)



'ఉషశ్రీ'గా పేరొందిన వక్త అసలు పేరు పురాణపండ సూర్యప్రకాశ దీక్షితులు. 1928 మార్చి 16న పశ్చిమ గోదావరి జిల్లా కాకరపర్రు అగ్రహారంలో జన్మించారు. ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో ఆయన నిర్వహించిన 'ధర్మ సందేహాలు' కార్యక్రమం ఎంతో పేరొందింది. రామాయణ, మహాభారతాలను వారంవారం ఆకాశవాణి నుంచి ప్రవచనం చేసేవారు. ఈ విధంగా రేడియో వ్యాఖ్యాతగా, సాహిత్య రచయితగా పేరొందారు. 1979లో టీటీడీ ఈఓగా పీవీఆర్‌కే ఉన్నప్పుడు ఆయనచే భాగవతం రాయించి పాతికవేల కాపీలు ముద్రించి భక్తులకు తక్కువధరకు అందించారు. 1990 సెప్టెంబరు 7న కన్నుమూశారు.

మమ్ముట్టి (పుట్టినరోజు)



'పద్మశ్రీ' పురస్కార గ్రహీత మమ్ముట్టి 1951 సెప్టెంబరు 7న కేరళ రాష్ట్రం అలప్పుజా జిల్లా చండిరూర్ గ్రామంలో జన్మించారు. అసలు పేరు మొహమ్మద్ కుట్టి పనపరంబిల్ ఇస్మాయిల్. మళయాళంతోపాటు నాలుగు దశాబ్దాలలో తమిళ, తెలుగు, కన్నడ, హిందీ, ఇంగ్లీషు భాషల సినిమాలలో నటించారు. 7 కేరళ రాష్ట్ర ఫిల్మ్‌ఫేర్, 5 ఏసియానెట్ ఫిల్మ్ అవార్డ్స్, ఉత్తమ నటుడితోపాటు గౌరవ డాక్టరేట్‌లు అందుకున్నారు. కొన్ని సినిమాలకు నిర్మాతగా కూడా వ్యవహరించారు. 2022లో కేరళ ప్రభుత్వ ప్రతిష్టాత్మకమైన 'కేరళ ప్రభ అవార్డు' పొందారు

టమోటా కిలో రూ.16

అనంతపురం రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో శనివారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.16తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠ ధర రూ.8, సరాసరి ధర రూ.12తో విక్రయాలు జరిగాయన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

అనంతపురం విద్య, సెప్టెంబరు6 (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్షలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ఐఈడీ సెక్టోరల్ పోస్టుకు దరఖాస్తులు స్వీకరణ గడవు ఈనెల 10 వరకు పొడిగించినట్లు ఏపీసీ శైలజ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గురుపూజోత్సవం, ఇతర సెలవులు రావడంతో దరఖాస్తు గడువు పొడిగించినట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

9న పీవీకేకేలో ప్రాంగణ నియామకాలు

అనంతపురంరూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆలమూరు రోడ్డులోని పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 9న ప్రాంగణ నియామకాలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ ఎస్‌వీహెచ్ ఇండియా ఆధ్వర్యంలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీ.టెక్, డిప్లొమా విద్యార్థులకు ఈ నియామకాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. మెకానికల్, ఈసీఈ, ఈఈఈ, ఆటోమొబైల్ విభాగాలకు చెందిన 2020 నుంచి 2025 వరకు పాస్ అవుట్ అయిన పురుష అభ్యర్థులు అర్హులు అన్నారు.

వేతనాల కోసం కార్మికుల నిరసన



దిగాలుగా మహిళా కార్మికులు

శిడ్లఘట్ట, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మూడు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని గోల్డెన్ ట్రెడ్ గార్మెంట్స్‌లో పనిచేస్తున్న కార్మికులు శనివారం నిరసన చేపట్టారు. తాలూకాలోని జంగమకోటె క్రాస్‌లోని గోల్డెన్ ట్రెడ్స్ గార్మెంట్స్‌లో 150మందికిపైగా కార్మికులు బట్టలను సిద్ధం చేస్తున్నారు. కార్మికులు మాట్లాడుతూ తమకు వేతనాలు సక్రమంగా ఇవ్వడం లేదని శిడ్లఘట్ట పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించగా స్వీకరించలేదన్నారు. తొలుత ఫ్యాక్టరీ యజమానితో చర్చలు జరపాలని సూచించడంతో సూచించారన్నారు. ఆమేరకు చర్చలు జరపగా రెండు కంతులలో బకాయి ఇస్తామని హామీ ఇచ్చి, రూ.9 లక్షల చెక్కు ఇచ్చారన్నారు. అయితే బ్యాంకులో సమర్పించగా అంతమొత్తం లేదని చెక్‌బౌన్స్ అయ్యిందన్నారు. ఒక్కొక్కరికి రూ.11వేల నుంచి 33వేల దాకా ఇవ్వాల్సి ఉందని, తొలుత సగం జీతమైనా ఇస్తే ఇళ్లబాడుగలు చెల్లించేందుకు అనుకూలం అవుతుందని కోరామన్నారు. జీతాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్నామన్నారు. అయినా సానుకూలంగా స్పందించక పోవడంతోనే నిరసన చేపట్టామన్నారు. తాము ఫ్యాక్టరీ యజమానికి ఫోన్ చేస్తే స్వీకరించడం లేదని, ఇక్కడి యంత్రాలను మరో ప్రాంతానికి మార్చు చేశారన్నారు. పోలీసుల ద్వారా మానుంచి బీగాలు తీసుకున్నారన్నారు. మా ఉద్యోగాల పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదని పలువురు మహిళలు వాపోయారు. కాగా రోడ్డుపై బైఠాయించిన కార్మికులను అక్కడనుంచి పోలీసులు పంపేశారు.

గుల్లహళ్ళిలో పశువుల ఆసుపత్రి ప్రారంభం



పశువుల ఆసుపత్రి ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యేకు సన్మానం

బంగారపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సరిహద్దులోని గ్రామాల రైతుల అనుకూలం కోసం బూదికోటె హోబళి గుల్లహళ్ళిలో పశువుల ఆసుపత్రిని ఎమ్మెల్యే నారాయణ స్వామి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేను ఆత్మీయంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కోలారు జిల్లాకు తాజాగా ఒక పశువుల ఆసుపత్రిని మంజూరు చేశారని అది గుల్లహళ్ళి గ్రామానికి మంజూరు కావడం సంతోషంగా ఉందన్నారు. పశువులకు అనారోగ్యమైతే హెల్ప్‌లైన్ నెంబరు 1962కు సంప్రదించాలని, వైద్యులు ఉచిత సలహా సూచనలు చేస్తారన్నారు. కాగా ప్రస్తుతం తాత్కాలికంగా పంచాయతీ నుంచి దూరంగా ఉన్న భవనంలో పశువుల ఆసుపత్రిని ప్రారంభించామని, గ్రామంలో తగిన స్థలాన్ని గుర్తించి పశువుల ఆసుపత్రికోసం సొంత భవనం నిర్మిస్తామన్నారు. భవనం నిర్మాణానికి ఎమ్మెల్యే గ్రాంటునుంచి రూ.25లక్షలు కేటాయించే హామీ ఇచ్చారు. పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రమేశ్ మాట్లాడుతూ ఇదివరకు జిల్లాలో ఉచితంగా టీకాలు ఇచ్చేవారని, ప్రస్తుతం మీ ఇళ్ల ముంగిటకు వస్తున్నాయని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పెంపుడు కుక్కలకుసైతం ర్యాబిస్ రాకుండా టీకాలు వేయించాలని సూచించారు. కాగా జిల్లా ప్రజలకు పశువుల పెంపకంపై కోలారులో రెండు రోజుల ఉచిత ట్రైనింగ్ ఉంటుందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ అధ్యక్షురాలు భవ్య, సంతోష్, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షురాలు కేవీ నాగరాజ్, పీఎల్‌బ్యాంకు డైరెక్టర్ మహదేవప్ప, డీసీసీ బ్యాంకు డైరెక్టర్ రంగాచారి, సహాయక డైరెక్టర్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థలకు ఎడ్యుకేషన్ సమ్మిట్ అవార్డు



బోస్టన్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు అవార్డు

బెంగళూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎన్‌గ్రేవ్‌మైండ్స్ సంస్థ గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని ఆదర్శప్రాయంగా సాగుతున్న పలు విద్యాసంస్థలకు అవార్డులను ప్రదానం చేసింది. విద్యారణ్యనగర్ చోళూరుపాళ్యలోని బోస్టన్ ఇంటర్నేషనల్ పబ్లిక్‌స్కూల్‌కు అవార్డు దక్కింది. స్కూల్ చైర్మన్ దర్శన్ కృష్ణను ప్రత్యేకంగా అభినందించారు. అదే తరహాలోనే మరియప్పనపాళ్యలోని సెయింట్ ఫిలోమినాస్ స్కూల్ రంగస్వామికి అవార్డు ప్రదానం చేశారు. ఎన్‌గ్రేవ్‌మైండ్స్ సంస్థ ఎండీ డాక్టర్ బీఏ కళాశంకర్, ఆర్‌వీ ఇంజనీరింగ్ ప్లేస్‌మెంట్ డీన్ రంగనాథ్, భారతీయ సంప్రదాయ ట్రస్టు డాక్టర్ మహర్షి గురూజీలు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందచేసి సత్కరించారు.

లాభాల బాటలో పాలసంఘం



పాలసంఘం వార్షిక సమావేశంలో సభ్యులు

ముళబాగిలు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని బల్ల పాల డెయిరీ 2024-25 వార్షిక సంఘానికి రూ.15లక్షలు లాభాల బాటలో ఉందని కోముల్ డైరెక్టర్ కాడేనహళ్ళి నాగరాజ్ అభిప్రాయపడ్డారు. గ్రామంలోని పాల డెయిరీ ఆవరణలో సంఘం వార్షిక సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ ప్రతి రోజూ వందమంది సరఫరా చేస్తున్నారన్నారు. 300మంది షేర్‌హోల్డర్లు కల్గిన మదర్ డెయిరీగా పురోగతిలో ఉందన్నారు. డెయిరీ పాలకవర్గం చక్కగా నిభాయించడం ద్వారా లాభాలు సాధ్యమయ్యాయన్నారు. సహకారరంగంలో రాణిస్తున్న కోముల్‌కు ఇతరవాటితో పోలిక అవసరం లేదన్నారు. క్యాంప్‌కు చెందిన డాక్టర్ కే కిరణ్ 2024-25 వార్షిక ఆడిట్ నివేదికను సమర్పించారు. తదుపరి వార్షిక సంవత్సరానికి అంచనాలు సమర్పించారు. డెయిరీ అధ్యక్షుడు శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. సభ్యులు హరీశ్, విస్తరణా ధికారులు ఆర్ చంద్రశేఖర్, సుబ్రమణి రెడ్డి, ముఖ్యకార్యనిర్వాహక అధికారి బీఎస్ శ్రీనివాస్, డెయిరీ ఉపాధ్యక్షుడు శామేగౌడ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి అత్యాచారం

బెంగళూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని నమ్మించి మహిళా న్యాయవాదిపై అత్యాచారానికి పాల్పడిన పోలీస్ కానిస్టేబుల్ సిద్దేగౌడను అరెస్టు చేశారు. బసవేశ్వరనగర్ పోలీసులు కేసు నమోదు చేసి కోర్టు ముందు హాజరు పరచగా జ్యుడీషియల్ కస్టడీకి ఆదేశించారు. వివరాలిలా. బాగల్‌కోటె జిల్లా జమఖండి ప్రాంతానికి చెందిన సిద్దేగౌడ మంగళూరు పాండేశ్వరలోని ఎస్‌ఏఎఫ్ (స్పెషల్ యాక్షన్ ఫోర్స్) విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. విజయపుర జిల్లా బబలేశ్వరకు చెందిన మహిళ బెంగళూరులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. హుబ్బళ్ళిలో ఒక పెళ్లిలో ఇద్దరికీ పరిచయం కలిగి అది ప్రేమగా మారింది. పెళ్లి చేసుకుంటానని సిద్దేగౌడ భరోసా ఇచ్చాడని, ఇలా బెంగళూరుకు సిద్దేగౌడ వచ్చినవేళ లాడ్జ్ గదికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడని బాధితురాలు వాపోయింది. అంతేకాక కులం పేరుతో దూషించారని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. పెళ్ళి చేసుకునేందుకు ఇంట్లో అంగీకరించరని చెప్పాడని బాధితురాలు ఫిర్యాదులో పొందుపరచినట్లు పోలీసులు తెలిపారు. కొంత నగదు కూడా తీసుకుని వాపసు ఇవ్వలేదని ఆమె ఆరోపించిందన్నారు. బాధితురాలు ఆగస్టు 8న బసవేశ్వర నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తప్పించుకుని తిరుగుతున్న సిద్దేగౌడను పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేసి శనివారం కోర్టులో హాజరు పరిచారు.

కుల వర్గీకరణ రిజర్వేషన్లలో అన్యాయం

దొమ్మసంద్ర, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కులవర్గీకరణ రిజర్వేషన్లను విద్య, ఉద్యోగ రంగాలకు మాత్రమే పరిమితం చేయడం అన్యాయమని మాదిగ సామాజిక నాయకుడు ఏ ఉదయ్‌కుమార్ ఆరోపించారు. దొమ్మసంద్రలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్లను పొరుగున ఉండే తెలంగాణ ప్రభుత్వం విద్య, ఉద్యోగ, రాజకీయ, పంచాయతీ రాజ్ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికలు, ప్రభుత్వ పథకాలకు వర్తింపచేసిందన్నారు. ఇదే తరహాలో ఎస్సీ రిజర్వేషన్లను అన్ని రంగాలకు కర్ణాటక ప్రభుత్వం వర్తింపచేయాలని కోరారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రిజర్వేషన్లను సమగ్రంగా అమలుకు ప్రభుత్వం చొరవ చూపాలన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

● జిల్లా అధికారి నితీశ్



ఇళ్ల ప్లాన్‌పై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ నితిశ్

రాయచూరు సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): నగర సమీపం ఏగనూరు వద్ద జీ ప్లస్ త్రి పద్ధతిలో నిర్మిస్తున్న గృహ నిర్మాణాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లాధికారి నితీశ్ సూచించారు. శనివారం నిర్మాణ పనులను మహానగర పాలిక కమిషనర్ జుబిన్ మొహపాత్రతో కలిసి జిల్లాధికారి పరిశీలించారు. ప్రధాన మంత్రి నగర ఆవాస్ యోజనా పథకంలో భాగంగా 2021-22 ఆర్థిక సంవత్సరంలో ఏగనూరు సమీపంలో మొత్తం 2491 గృహ నిర్మాణానికి జీ ప్లస్ త్రి పద్ధతిలో పనులు ప్రారంభించారు. మొదటి విడతలో 1191 ఇళ్ల నిర్మాణం సాగుతుండగా ఇందులో 300 ఇళ్లను దీపావళి నాటికి పూర్తి చేసి లబ్దిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లాధికారి ఆదేశించారు. ఈ క్రమంలో సంబంధిత అధికారులు, గుత్తేదారులు ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తు పనులు నాణ్యత ప్రమాణాలతో ఉండేలా జాగ్రతలు తీసుకోవాలన్నారు. గృహ నిర్మాణం అనంతరం కనీస సౌకర్యాలు తాగునీరు వంటివి సత్వరం లబ్దిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని ఈ విషయంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనులు నిర్వహించాలని ఆదేశించారు.

బ్యాంకు దొంగ అరెస్టు

● రూ.2 కోట్ల విలువైన బంగారం స్వాధీనం
● నిందితుడు మాజీ బీఎస్ఎఫ్ జవాను
● వివరాలు వెల్లడించిన ఎస్పీ రత్న

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): హిందూపురం రూరల్ మండలం తూముకుంట చెక్‌పోస్టు వద్ద ఎస్‌బీఐలో జరిగిన చోరీ కేసులో అంతరాష్ట్ర దొంగల ముఠా సభ్యుడు అనిల్ కుమార్ పన్వార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతన్నుంచి రూ.2 కోట్ల విలువైన రెండు కేజీల బంగారం ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ రత్న తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో హిందూపురం డీఎస్పీ కేవీ మహేష్‌తో కలసి శనివారం ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. హరియాణాలోని గుర్గావ్ జిల్లా మారుతికుంజ్ గ్రామానికి చెందిన అనిల్ కుమార్ పన్వార్ మాజీ బీఎస్ఎఫ్ జవాన్ అని, వ్యసనాలకు బానిసై, డబ్బు కోసం బ్యాంకు దోపిడీలకు పాల్పడుతున్నాడని ఎస్పీ తెలిపారు. జైలుకు వెళ్ళి వచ్చినా అతని తీరు మారలేదని, 2018లో అనంతపురం జేఎన్‌టీయూ సమీపంలోని స్టేట్ బ్యాంకులో జరిగిన దొంగతనం కేసులో నిందితుడని తెలిపారు. కోయంబత్తూరు సబ్ జైలులో 5 సంవత్సరాల జైలు శిక్ష అనుభవించి, జూన్‌లో బయటకు వచ్చాడని, మరో వ్యక్తితో కలిసి జూలై 26న తూముకుంట చెక్‌పోస్టు సమీపంలోని స్టేట్ బ్యాంకులో చోరీకి పాల్పడ్డాడని తెలిపారు. డీఐజీ షిమోషి ఆదే శాలతో డీఎస్పీ కేవీ మహేష్, హిందూపురం అప్‌గ్రేడ్ సీఐ చంద్ర అంజినేయులు కేసును దర్యాప్తు చేశారని తెలిపారు. ఉమ్మడి జిల్లాతో పాటుగా చిత్తూరు, తిరుపతికి చెందిన 8 ప్రత్యేక బృందాలు 5 రాష్ట్రాలలో గాలింపు చర్యలు చేపట్టి, అనిల్ కుమార్ పన్వార్‌ను అరెస్టు చేశారని తెలిపారు. నిందితుడిని కస్టడీకి తీసుకుని విచారించామని, అతను చెప్పిన వివరాల ఆధారంగా 2 కేజీల బంగారం అభరణాలు, దొంగతనానికి ఉపయోగించిన హోండా సిటీ కారు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఇతనిపై దేశంలోని పలు రాష్ట్రాల్లో 14 దొంగతనం కేసులు ఉన్నాయని తెలిపారు. రాజస్థాన్‌కు చెందిన మరో నిందితుడు పరారీలో ఉన్నాడని, త్వరలోనే అరెస్టు చేస్తామని ఎస్పీ తెలిపారు. ముఠా సభ్యుడిని పట్టుకున్న డీఎస్పీ కేవీ మహేష్, సీఐలు అంజనేయులు, అబ్దుల్ కరీం, శేఖర్, జైపాల్ రెడ్డి, రాజ్‌కుమార్, జనార్ధన్, ఉమ్మడి అనంతపురంజిల్లా, చిత్తూరు, తిరుపతి జిల్లా ప్రత్యేక బృందాలను ఎస్పీ అభినందించారు. వారికి రివార్డులు ప్రశంసా పత్రాలను అందచేశారు.



దోపిడీకి ఉపయోగించిన కారు, బైక్, స్వాధీనం చేసుకున్న బంగారంతో పోలీసులు

తాడిపత్రికి పెద్దారెడ్డి

● 16 నెలల తరువాత ప్రవేశం ● పట్టణంలో భారీ పోలీసు బందోబస్తు

తాడిపత్రి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పటిష్ఠ పోలీసు బందోబస్తు మధ్య 16 నెలల తర్వాత మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి శనివారం తాడిపత్రికి చేరారు. గత ఏడాది సార్వత్రిక ఎన్నికల అనంతరం జరిగిన హింసాత్మక ఘటనల నేపథ్యంలో టీడీపీ, వైసీపీ నాయకులను నియోజకవర్గం నుంచి బహిష్కరించిన విషయం తెలిసిందే. అయితే ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించడంతో మూడు నెలల తర్వాత ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ ప్రభాకర్‌రెడ్డి తాడిపత్రికి చేరుకున్నారు. కానీ మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిని మాత్రం తాడిపత్రికి రానీయలేదు. పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో ఆయన కింది స్థాయి నుంచి సుప్రీం కోర్టుదాకా వెళ్లాడు. కోర్టు ఆదేశాల మేరకు భారీ బందోబస్తు మధ్య శనివారం తాడిపత్రిలోని తన స్వగృహం చేరారు. పెద్దారెడ్డి రాకతో పట్టణంలో హై టెన్షన్ వాతావరణం ఏర్పడిం ది. జిల్లా ఎస్పీ ఉదయమే తాడిపత్రికి చేరుకుని భద్రతను సమీక్షించారు. ఆయన ఆదేశాల మేరకు గొడవలు సృష్టిస్తారనే అనుమానం ఉన్న చోటా మోటా నాయకులందరిని ముందుగా హౌస్ అరెస్ట్ చేశారు. పెద్దారెడ్డి మాట్లాడుతూ పోలీసులకు సహకరిస్తానని, తన పార్టీ నాయకులకు అండగా ఉంటానని తెలిపారు. తమ పార్టీ నాయకుల ఇళ్ల వద్దకు వెళ్లి పరామర్శిస్తానని తెలిపారు. ప్రజల పక్షాన నిలబడి పోరాడుతానని తెలిపారు. కాగా జేసీ ప్రభాకర్‌రెడ్డి, వారి కుటుంబసభ్యులు తాడిపత్రిలో లేకపోవడం గమనార్హం.



ఇంటి వద్ద పెద్దారెడ్డికి దిష్టి తీస్తున్న అభిమాని

9న ఇంటర్వ్యూలు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఏఎఫ్ ఎకాలజీ సెంటర్, స్వర్ణభారత్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 9న ఫార్మా శిక్షణ, ఉద్యోగాల ఎంపికకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ వైవీ మల్లారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ, డిప్లొమా, బి.ఫార్మా, ఎమ్మెస్సీ, బి.టెక్ చదివిన 25 ఏళ్ల లోపు వయస్సు కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు స్వర్ణభారత్ ట్రస్టు ఆధ్వర్యంలో విజయవాడలో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ, భోజనం, వసతి సదుపాయం కల్పిస్తామని అన్నారు. ఫార్మా రంగంలో అత్యున్నత నైపుణ్య శిక్షణ కల్పించి, వివిధ ప్రముఖ ఫార్మా కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని అన్నారు. అభ్యర్థులు విద్యార్హత, జనన ధ్రువీకరణ, ఆధార్‌కార్డులతో ఆర్డీటీ స్టేడియం ఎదురుగా ఉన్న ఎకాలజీ సెంటర్‌లో హాజరుకావాలని పేర్కొన్నారు. 8121717846ను సంప్రదించాలని కోరారు.

సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాల, బాలికల సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 9న ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గాయత్రి, గంగమ్మ తెలిపారు. ఈనెల 26వతేదీ నుంచి విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి సీనియర్ మహిళా సాఫ్ట్‌బాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

ఉపాధ్యాయులది గురుతర బాధ్యత: మంత్రి



మాట్లాడుతున్న మంత్రి బోసరాజు

రాయచూరు సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పాఠ్యాంశాల్లో ఉన్న పాఠాలను బోధించడమే కాదు ఉత్తమ సమాజ నిర్మాణంలో కీలక భూమిక పోషిస్తున్న ఉపాధ్యాయులది గురుతర బాధ్యత అని రాష్ట్ర చిన్ననీటి పారుదల శాఖ మంత్రి ఎన్ఎస్ బోసరాజు అన్నారు. మాజీ రాష్ట్రపతి దివంగత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 118వ జయంతిని పురస్కరించుకుని శనివారం నగరంలోని పండిత్ సిద్దరామ్ జంబలదిన్ని రంగమందిరంలో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి , దివంగత నేత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఉపాధ్యాయులు బోధనకే పరిమితం కాకుండా విద్యార్థుల్లో నైతిక విలువలు పెరిగేలా తమ బోధనను సాగించాలన్నారు. అదే సమయంలో అనేక అసౌకర్యాల నడుమ తమ విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులకు ప్రత్యేక అభినందనలు తెలుపుతూ సౌకర్యాల కల్పన కోసం తమ ప్రభుత్వం నిబద్ధతతో పని చేస్తుందన్నారు. కాగా కల్యాణ కర్ణాటక ప్రాంతం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేల కోట్లు కేటాయించగా అందులో 25 శాతం నిధులు విద్య అభివృద్ధికి కేటాయిస్తున్నట్లు మంత్రి గుర్తు చేశారు. సమావేశంలో మాట్లాడిన సిటీ ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటీల్, ఉపాధ్యాయులు బోధనేతర పనులు నిర్వహిస్తుండడం కష్టంగా మారిందని వాటి నుంచి వారిని తప్పించాలని కోరారు. అదే సమయంలో జిల్లాలో గురు భవన్ నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే నిధులు మంజూరు కాగా స్థళం లభించకపోవడం సమస్యంగా మారిందని ప్రభుత్వం దాని పై దృష్టి సారించాలని కోరారు.



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలతో అధికారులు, నాయకులు



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1625.90	1,632.73
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	44.650	32,877
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	36,232	28,960
నీటి నిల్వ (టీఎంసీలు)	79.47	101.77

13 ట్రాక్టర్లలో బ్యాటరీలు చోరీ



చోరీకి గురైన ట్రాక్టర్

బళ్లారి సిటీ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని పలు గ్రామాల్లో దొంగలు ట్రాక్టర్ బ్యాటరీలను చోరీ చేశారు. శుక్రవారం జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలు అయిన కమ్మర చేడు, విఘ్నేశ్వర్ క్యాంప్, శంకర్‌బండే , ఎత్తిన బూదిహాల్ గ్రామాలలో ఇళ్ల ముందు నిలిపి ఉంచిన ట్రాక్టర్లలో బ్యాటరీలను దొంగిలించారు. ఓ బొలెరో వాహనం బ్యాటరీని దొంగిలించడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. రాత్రికి రాత్రే బ్యాటరీలు చోరీ అయినట్లు తెలిసింది. బాధితులు న్యాయం చేయాలని గ్రామీణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

హోమియోపతికి లైసెన్స్.. అల్లోపతి వైద్యం



క్లినిక్‌ను సీజ్ చేసిన అధికారులు

హోస్పేట,సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి):తాలూకాలోని కమలాపూర్ పట్టణంలో శనివారం నకిలీ వైద్యుడిపై అధికారులు దాడి చేశారు. కమలాపూర్‌లో అస్లాం బాషా అనే నకిలీ వైద్యుడు సఫా క్లినిక్ నడుపుతున్నారు. సమాచారం అందుకున్న జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ శంకర్‌నాయక్, జిల్లా ఆయుష్ అధికారులు, హోస్పేట తాలూకా ఆరోగ్య అధికారుల నేతృత్వంలో దాడులు చేశారు. అస్లాంబాషాకు ఆశ్రయం ఇచ్చిన విజయనగర్ మెడికల్ యజమాని పరారీలో ఉన్నారు. కేపీఎంఈ చట్టం కింద కమలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో అధికారులు ఫిర్యాదు చేశారు. క్లినిక్‌ను సీజ్ చేశారు. శ్రీ పద్మక్లినిక్ నడుపుతున్న డాక్టర్ సుహాస్, కేపీఎంఈలో నమోదు చేసుకోకుండా హోమియోతి వైద్యానికి లైసెన్సు పొందుతూ ఆల్లోపతి సేవలను అందించినట్లు అధికారులు తెలిపారు. సుధా క్లినిక్‌ను సందర్శించి డాక్టర్ మనోహర్ బయోమెడికల్ వ్యర్థాలను సరిగా నిర్వహించనందుకు అతనికి నోటీసు ఇచ్చారు.

కుక్కల దాడిలో గొర్రెల మృతి

కంప్లి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి) : విజయనగరం జిల్లా హగరి బొమ్మనహళ్లి పట్టణంలోని రామ్‌రహీమ్ నగర్‌లో వీధి కుక్కలు దాడిలో 12 గొర్రెపిల్లలని హత మార్చాయి. ఉలువట్టి గ్రామానికి ముతుగప్ప పొలంలో కొట్రేష్‌కు చెందిన 12 గొర్రెపిల్లలు మృతి చెందాయి. పదికి పైగా గాయపడ్డాయి. గాయపడిన గొర్రెలకు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సూరప్ప చికిత్స అందించారు. మున్సిపల్ అధ్యక్షులు ఎం మరిరామప్ప, రాఘవేంద్ర, నాయకులు దేవేంద్ర సంఘటనా స్థలాన్ని సందర్శించి ప్రభుత్వం నుండి నష్టపరిహారం అందేలా చేపడతామని గొర్రెల కాపరికు హామీ ఇచ్చారు.



మృతి చెందిన గొర్రెపిల్లలు

పెండింగ్ కేసులను పరిష్కరించుకోవాలి

● 13న జాతీయ లోక్ అదాలత్ ● బాధితులు సత్వర న్యాయాన్ని పొందే అవకాశం: జిల్లా న్యాయాధికారి ప్రమోద్



మాట్లాడుతున్న న్యాయాధికారి ప్రమోద్

బళ్లారి సిటీ,సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): జాతీయ రాష్ట్ర న్యాయ సేవల అధికారుల ఆదేశాల మేరకు ఈ సంవత్సరం మూడవ జాతీయ లోక్ అదాలత్‌ను బళ్లారి జిల్లా న్యాయసేవల అథారిటీ సెప్టెంబరు 13న నిర్వహించనున్నట్లు మొదటి అదనపు జిల్లా సెషన్ న్యాయాధికారి ప్రమోద్ తెలిపారు. నగరంలోని తాళూరు రోడ్డులోని కొత్త జిల్లా కోర్టు సముదాయంలోని మూడవ అంతస్తు ఆడిటోరియంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు పార్టీల పరస్పర సయోధ్య ,వేగవంతమైన న్యాయం, (బళ్లారి, విజయనగరం) జిల్లాలోని 31కోర్టులలో పరిష్కరించగల వివిధ కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకోవచ్చని కోర్టు ఫీజులను తిరిగి చెల్లిస్తామని జాతీయ లోక్ అదాలత్ సహకార సంస్థ ప్రకటించిందన్నారు. వైవాహిక కుటుంబం, మోటారు ప్రమాదం , చెక్కుబౌన్స్ , వాణిజ్య సేవా కేసులు చర్చించదగిన వినియోగదారుల వివాదాలు, డీఆర్‌టీభాగస్వామ్యం , రవాణా ఇతర సివిల్ కేసులు సహా అన్ని కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. లోక్ అదాలత్ ప్రజలకు సులభంగా త్వరగా తక్కువ ఖర్చుతో న్యాయం అందిస్తాయని, . దీని వల్ల కోర్టులపై భారం తగ్గుతుందన్నారు. ఇది న్యాయమూర్తులు మరింత సంక్లిష్టమైన కేసులపై దృష్టి పెట్టడానికి సహాయపడుతుందన్నారు.

90 రోజుల ప్రత్యేక ప్రచారం

జిల్లాకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం కోసం జూలై 1 నుంచి జిల్లాన్యాయ సేవల అథారిటీ ఇప్పటికే ప్రారంభించిన దేశం కోసం మధ్యవర్తిత్వం 90రోజుల ప్రత్యేక ప్రచారం అక్టోబర్ 7న ముగుస్తుందన్నారు. పెద్ద సంఖ్యలో కక్షిదారులు దీనిని సద్వినియోగం చేసుకుని తమ కేసులను పరిష్కరించుకోవాలన్నారు.ఇక్కడ శిక్షణ పొందిన, అనుభవజ్ఞులైన సీనియర్ న్యాయవాదులు మధ్యవర్తిత్వం వహిస్తారన్నారు. జిల్లాలోని శిక్షణ పొందిన న్యాయవాదులు కూడా దీనిని విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఇక్కడ రెండుపార్టీలను పిలిచి కోర్టుల మధ్య వర్తిత్వ కేంద్రాలలో మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరిస్తారు. దీనిని కూడ గోప్యంగా ఉంచుతారు. ప్రత్యేక అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని అన్నారు.

జరిమానాలో 50శాతం తగ్గింపు

పోలీసు శాఖ మొబైల్ చానల్‌లో నమోదైన పెండింగ్ కేసుల జరిమానా మొత్తంపై 50శాతం తగ్గింపును అందించిందని ఈ తగ్గింపు సౌకర్యం సెప్టెంబరు 12వరకు అందుబాటులో ఉంటుందన్నారు. ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈసందర్భంగా జిల్లా కోర్టు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోండి

● ఉభయ జిల్లాల్లో పుష్కలంగా వ్యాపారాలు: రాష్ట్రస్థాయి హోటల్ అసోసియేషన్ సమావేశంలో ఎమ్మెల్యే సురేష్ శెట్టి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సురేష్‌శెట్టి

బళ్లారి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): హోటల్ పరిశ్రమలో కొత్త అవకాశాలను ఉపయోగించుకోవాలని కాపు నియోజకవర్గం ఎమ్మెల్యే జీ. సురేష్‌శెట్టి అన్నారు. బళ్లారి జిల్లా వాణిజ్య మరియు పరిశ్రమల మండలి, కర్నాటక రాష్ట్ర హోటల్ యజమానుల అసోషియేషన్, జిల్లా హోటల్ అసోషియేషన్ సంయుక్తంగా బళ్లారిలోని చాంబర్ అఫ్ కామర్స్ ఆడిటోరియంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి చాంబర్ ఆఫ్ కామర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి అధ్యక్షతన వహించారు. ముందుగా జ్యోతిని వెలిగించి కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం ముఖ్య అతిథి కాపు ఎమ్మెల్యే జి సురేష్ శెట్టి మాట్లాడారు. బళ్లారి, విజయనగర జిల్లాలు పర్యాటక కేంద్రాలు, ఇక్కడ హోటల్ నిర్వహణకు అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. హోటల్ పరిశ్రమదారులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్రోత్సహిస్తున్నాయన్నారు. సబ్సిడీతో రుణాలు కూడా అందిస్తున్నారన్నారు. బళ్లారితో తన బంధాన్ని మరువలేనన్నారు. తాను ఎక్కడి నుంచో వచ్చి బళ్లారిలో హోటల్ నిర్వహించే సమయంలో అందరూ దగ్గర అయ్యారన్నారు. అధ్యక్షుడు యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి మాట్లాడుతూ బళ్లారిలో హోటల్ పరిశ్రమ అభివృద్ధి చెందడానికి అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు అందిస్తున్న వివిధ రుణాల పై అవగాహన కల్పించేందుకు త్వరలో ఒక అవగాహన కేంద్ర ఏర్పాటు చేస్తామన్నారు. ఎక్సైజ్‌శాఖ కమిషనర్ మంజునాథ్, జీఎస్టీ అధికారి. జి. విశ్వనాథ్ తదితరులు హోటల్ యజమానులు పన్ను పై మాట్లాడారు. వీరితో పాటు కర్నాటక రాష్ట్ర హోటల్ అసోషియేషన్ జిల్లా యూనిట్ అధ్యక్షుడు హెచ్. ఏ మధుసుధన్, చాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షుడు మంజునాథ, మర్చేడ్ హోటల్ చాంబర్ ఆఫ్ కామర్స్ యజమాని మల్లికార్జున, ఎం.వి. రారుఘువేంద్ర, ఎస్. దొడ్డనగౌడ, సొంతగిరిధర్, కేసి, సురేష్‌బాబు, రామచంద్ర, బళ్లారి జిల్లాలో ఉన్న హోటల్ యజమానులు హజరయ్యారు.

ఘనంగా గణేశ్ నిమజ్జనం



కంప్లిలో ఉత్సాహంగా పాల్గొన్న భక్తులు



విజయ్ సింధూర్ గణపతి



సిరుగుప్పలో భక్తుల సందడి

కంప్లి/సిరుగుప్ప, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి) : కంప్లి పరిధిలోని గ్రామాల్లో పట్టణాల్లో వినాయక నిమజ్జనం కార్యక్రమం వైభవంగా చేపట్టుకున్నారు. సింధనూరు పట్టణంలో నిమజ్జనం కార్యక్రమంలో ఆపరేషన్ సింధూర్ జాతీయ పతాకంతో వినాయకుడు నిమజ్జనం కార్యక్రమంలో ఊరేగింపు చేపట్టారు. అలాగే డోలుడప్పులతో కళాకారులు కట్టుకున్నారు. కంప్లి పట్టణంలో కూడా వినాయక నిమజ్జనం కంప్లి అధిపతి వినాయక నిమజ్జనం భాజభజంత్రీల మధ్య మహిళలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నారు. వేషభూషణలతో పట్టణంతో పాటు వివిధ గ్రామాల నుండి క్యాంపుల నుండి తరలివచ్చారు. ఎలాంటి సంఘటనలు జరుగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

సిరుగుప్ప : అంగరంగ వైభవంగా హిందూ మహాగణపతి నిమజ్జన కార్యక్రమం జరిగింది. సిరుగుప్ప పట్టణంలో 11 రోజుల పాటు హిందూ మహా గణపతికు వేదపండితులు పూజలు చేశారు. వివిధ ధార్మిక కార్యక్రమాలను చేపట్టారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి శోభాయాత్ర ప్రారంభమైంది. హైస్కూలు గ్రౌండ్ నుంచి తుంగభద్ర నది వరకు భారీఎత్తున తాలుకా ప్రజలు, విశ్వహిందూపరిషత్, భజరంగదళ్ కార్యకర్తలు, యువతీ యువకులు కోలాహలంగా తుంగభద్ర నది వరకు ఊరేగింపు కొనసాగింది. వివిధ వేషభూషణలు, బొమ్మలాటల ప్రదర్శన, యువకుల డ్యాన్సులతో రోడ్లు కిక్కిరిసి పోయాయి. మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప, బీజేపీ జిల్లా యూత్ అధ్యక్షులు సిద్దప్ప, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఊరేగింపులో పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ శోభారాణి ఆధ్వర్యంలో వెయ్యి మందికి పైగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వందకు పైగా సీసీ కెమెరాలతో కార్యక్రమాన్ని రికార్డు చేయడం జరిగింది. డీఎస్పీ సంతోష్‌చౌహాన్, సీఐ హనుమంతప్ప, ఎస్ఐ పరశురామ్, పోలీసు సిబ్బంది ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు వేలాది మంది తరలివచ్చారు.

ఈఎల్‌ఎఫ్ సర్వేకు అధికారులు సహకరించాలి

●తహసీల్దార్ సురేశ్ వర్మ

రాయచూరు సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం చేపట్టిన ఈఎల్‌ఎఫ్, ఫైలేరియ సర్వేకు ఇతర శాఖల అధికారులు సహకరించాలని తహసీల్దార్ సురేశ్ వర్మ సూచించారు. సర్వేకు సంబంధించి శనివారం తహసీల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన తహసీల్దార్ రాష్ట్ర స్థాయి నివేదిక ఆధారంగా రాయచూరు తాలూకాలో 37 పాఠశాలలతో పాటు అదనంగా మరో 17 పాఠశాలలను ఫైలేరియ సర్వే ఎంపిక కోసం ఎంపిక చేశారన్నారు. ఇందుకు ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలు సహితం ఉన్నాయన్నారు. ఈ విషయంలో సర్వేకు సహకరించని పాఠశాలల పై తమకు వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. సెప్టెంబరు చివరి నుంచి దసరా సెలవులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆలోగానే సర్వే పనులు పూర్తైయ్యేలా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు.

హోసూరు జోన్



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కిక్ బాక్సింగ్‌లో రాణించిన విద్యార్థులు

హోసూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): చెన్నైలో నిర్వహించిన జాతీయ కిక్‌బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో కృష్ణగిరి జిల్లా విద్యార్థులు రాణించారు. తమిళనాడు రాష్ట్ర అమెచ్యూర్ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ తరఫున జాతీయస్థాయిలో జరిగిన పోటీలలో తమిళనాడు సహా 28 రాష్ట్రాలకు చెందిన 1600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. తమిళనాడుకు చెందిన వివిధ విభాగాల పోటీలలో 45 బంగారం, 40 వెండి, 70 కాంస్యపతకాలు మొత్తం 155 పతకాలను సాధించారు. కృష్ణగిరి జిల్లా అమెచ్యూర్ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ బృందంలో ఏడుగురు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. నేషనల్ రెఫరీగా నాగరాజ్, జూనియర్ కోచ్ మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు. జిల్లా తరఫున పాల్గొన్న విద్యార్థులు యశ్వంత్, కీర్తిసెల్వన్, పవిన్, లక్షిత్‌లు ప్రోత్సాహక బహుమతులు సాధించారు.

సీఎస్‌ఆర్ నిధులతో తాగునీటి బోరు



బోరు వేయిస్తున్న నాయకులు రాజశేఖర్, దుగ్గప్ప తదితరులు

కంప్లి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి) : కుడితిని పట్టణంలోని 3వ వార్డు నేతాజీ కాలనీలో శనివారం ఏసీసీ సిమెంట్ ఆదానీ సంస్థ ఆధ్వర్యంలో సీఎస్‌ఆర్ నిధులతో బోర్‌వెల్ వేశారు. ఈ సందర్భంగా పట్టణ పంచాయతీ స్థాయి సమితి అధ్యక్షులు వి రాజశేఖర్ మాట్లాడుతూ తాము అధ్యక్షుడిగా ఉన్న సమయంలో నీటి సమస్య వుంటే వార్డులో అన్ని పరిశీలించి ఏసీసీ అదానీ మేనేజ్‌మెంట్ అధికారులకు వార్డులో వుండే నీటి సమస్యపై తెలుపగా వారి నుండి ఆరు బోర్లు వేయించడానికి అనుమతులు కల్పించారు. నీటి సమస్య వుండే వార్డుల్లో బోర్‌వెల్ వేసి వార్డుల్లో నీటి సమస్య తలెత్తకుండా చేపట్టామన్నారు. అలాగే నేతాజీ కాలనీలో నూతనంగా విద్యుత్ లైన్లో సీసీ రోడ్లు నీటి సమస్య తలెత్తకుండా చేపట్టామన్నారు. హోదాల కన్నా ప్రజల సమస్యలు తీర్చడమే ముఖ్యమన్నారు. వార్డు కౌన్సిలర్ దుర్గప్ప, వెంకట రమణబాబు, గంగాధర, నాగరాజు పాల్గొన్నారు.

మైనార్టీలకు అండగా ఉంటాం : ఎమ్మెల్యే



ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డిని సత్కరిస్తున్న ముస్లింలు

బళ్లారిరూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): బళ్లారి నగరంలో మైనార్టీలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ముస్లిం మత గురువు ఖాజీ గులాం మహమ్మద్ సిద్దిక్ నివాసంలో జరిగిన ఈద్ మిలాద్ ఫతిహా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మత గురువులు భరత్‌రెడ్డి ఆధ్వర్యంలో బళ్లారి జిల్లా నగర ప్రజలు ఆరోగ్య దీర్ఘాయుష్షు, సంపద శాంతి శ్రేయస్సు అన్ని వర్గాల అభివృద్ధి కోసం ఖాజీ మహమ్మద్ ప్రార్థనలో నిర్వహించారు.



జిల్లా ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న డీహెచ్ఓ రమేశ్‌బాబు

సాధారణ జ్వరాలే..

● వర్షం కారణంగా ప్రబలుతున్న వైరల్ జ్వరాలు
● ఆందోళన అవసరం లేదు : డీహెచ్ఓ

బళ్లారి సిటీ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా, వాతావరణ పరిస్థితుల్లో మార్పు కారణంగా జిల్లా అంతటా సాధారణ జ్వరాలు నమోదవుతున్నాయని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డీహెచ్ఓ రమేశ్ బాబు అన్నారు. జిల్లాలో జ్వరాలు పెరుగుతున్న నేపథ్యంలో ఆయన శనివారం జిల్లాఆసుత్రిని సందర్శించి చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఆసుపత్రి , తాలూకా ఆసుపత్రుల్లో అవసరమైన మందులు నిల్వ ఉంచామని. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదన్నారు. వర్షాల నేపథ్యంలో వైరస్‌లు సర్వసాధారణం చల్లని ఉష్ణోగ్రతలలోకూడా పునరుత్పత్తి అయ్యే అవకాశం ఉందన్నారు. ప్రజలు పోషకమైన వెచ్చని ఆహారాన్ని తీసుకోవాలని, రోగనిరోధక శక్తి పెరగడానికి ఆరోగ్యకరమైన విటమిన్లు అధికంగా ఉండే ఆహారాన్ని తినాలని ఆయన ప్రజలను అభ్యర్థించారు. కలుషితమైన నీటిని తాగకుండా ఇంటి చుట్టూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో జిల్లాసర్జన్ డాక్టర్ బసారెడ్డి, నర్సింగ్ సూపరెంటెండెంట్ విమల, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహిస్తాం

● లిడ్కర్ అధ్యక్షుడు ముండరగి నాగరాజు



దసరా క్రీడల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న నాగరాజు

బళ్లారి సిటీ, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని క్రీడాకారులను ప్రోత్సహించడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారికి తగిన శిక్షణ వసతి కలిస్తామని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ లెదర్ అండ్ ఇండస్ట్రీయిల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ లిమిటెడ్ ఛైర్మన్ ముండరగి నాగరాజు అన్నారు. జిల్లాయంత్రాంగం,జిల్లాపంచాయతీ , యువజన సాధికారత క్రీడా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని జిల్లా స్టేడియంలో దసరా క్రీడాపోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ షెడ్యూల్డ్ కులాల అంతర్గత రిజర్వేషన్ కారణంగా రాష్ట్రంలో పోస్టుల నియామకం నిలిచి పోయిందని, త్వరలో అన్నీ మళ్లీ చేపడ్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ విభాగాల నియామకాల్లో క్రీడాకారులకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించిందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. క్రీడల్లో పాల్గొనడం వల్లశారీరక మానసిక, మేథస్సు, ఆరోగ్యం అబివృద్ధి చెందుతాయన్నారు. క్రీడలు మన జీవితాలను సుసంపన్నం చేస్తాయన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సర్వసాధారణం, జిల్లా రాష్ట్ర జాతీయ అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొని జిల్లాకు కీర్తి తీసుకురావాలని పిలుపునిచ్చారు. నేటి యువల మొబైల్ పోన్లు ఎక్కువగా వాడకూడదని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలన్నారు. ఈసందర్భంగా జిల్లా హామీ పథకాల అమలు ఛైర్మన్ చిదానందప్ప మాట్లాడుతూ పంటలు సమృద్ధిగా ఉంటే మంచి పంట వస్తుంది, ఒక వ్యక్తి ఆరోగ్యంగా ఉంటే అతను బలంగా మారగలడు కాబట్టి బలమైన దేశాన్ని నిర్మించడంలో యువతరం పాత్ర చాలా ముఖ్యమైనది యువత క్రీడలలో పాల్గొని బలంగా మారాలి. వారు వయస్సు ఉన్నప్పుడే క్రీడలలో పాల్గొని జిల్లాకు కీర్తి తీసుకురావాలని అన్నారు.

యువజన సాదికారత క్రీడల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గ్రేసీ మాట్లాడుతూ విజయం సాధించడానికి తగిన శిక్షణ ద్వారా కృషి చేయాలన్నారు. కష్టపడి పనిచేయాలని క్రీడాకారులకు సూచించారు. ఈకార్యక్రమంలో విజయనగరం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ఫిజికల్ టీచర్ శశిధర్ కెల్లూరు, హాకి కోచ్ జాకీర్, అథ్లెట్ షమీనా, డిపార్ట్‌మెంట్ సిబ్బంది కోచ్‌లు బళ్లారి జిల్లాకు చెందిన అథ్లెట్లు, తదితరులు పాల్గొన్నారు.

గుండె చికిత్స యూనిట్ ఏర్పాటుకు ఆమోదం

హోస్పేట,సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి):విజయనగం, బళ్లారి, కొప్పళ్ జిల్లాలను కలిగి ఉన్న హోస్పేట నగరంలోని 250పడకల జిల్లా ఆసుపత్రిలో 20 పడకల గుండె చికిత్స యూనిట్ ఏర్పాటుకు ప్రభుత్వం రూ. 10కోట్లు గ్రాంట్ విడుదల చేయడం పట్ల హోస్పేట ఎమ్మెల్యే హెచ్‌ఆర్ గవియప్ప హర్షం వ్యక్తం చేశారు. గత రెండు సంవత్సరాలుగా నిరంతర ప్రయత్నాల ఫలితంగా విజయనగం జిల్లా హోస్పేటలోని 250 పడకల జిల్లా ఆసుపత్రిలో 20 పడకల కార్డియాక్ కేర్ యూనిట్ ఏర్పాటుకు ఈనెల 4న జరిగిన మంత్రి వర్గ సమావేశంలో ఆమోదం తెలిపారు.ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దినేష్ గుండూరావు, జిల్లా ఇన్చార్జి మంత్రి బీజెడ్ జమీరా అహ్మద్‌ఖాన్‌లకు ఎమ్మెల్యే గవియప్ప కృతజ్ఞతలు తెలిపారు.

అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక ఏకగ్రీవం



దొడ్డ బసప్పను సత్కరిస్తున్న గ్రామస్థులు

కంప్లి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): కంప్లి తాలుకా పరిధిలోని సన్నాపురం ఉపకాలువలు నీరు వాడకం సంఘం అధ్యక్ష ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 11 మంది సభ్యులు వుండగా దొడ్డబసప్ప అయ్యమ్మ ఎన్నికయ్యారు. అందులో అధ్యక్షులుగా సన్నాపురం దొడ్డ బసప్ప ఉపాధ్యక్షులుగా బెళగోడుహాళ్ గ్రామానికి చెందిన అయ్యమ్మ ఐదుగురు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన వారికి ప్రముఖులు, సభ్యులు అభినందించి సన్మానించారు. అనంతరం నీరు వాడకం సంఘం అధ్యక్షులు దొడ్డ బసప్ప మాట్లాడుతూ తమపై వుంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామన్నారు. రైతులకు ఏ సమస్య ఎదురైనా తాము ఎదురుగా వుండి ఆ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. నీరు వాడకంలో ప్రతి రైతుకు న్యాయం చేకూర్చుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మూకయ్యస్వామి, వెంకట రమణరాజు, గ్రామ పంచాయతీ అధ్యక్షులు రమణయ్య, శరణప్ప, వీరేశప్ప, రేణుక గౌడ, హనుమంతు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

బళ్లారిరూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని సంగనకల్లు వృద్ధాశ్రమంలో బాలకృష్ణ కుమారుడు మోక్షజ్ఞ జన్మదినం సందర్భంగా బాలకృష్ణ, నందమూరి కళ్యాణ్ రామ్ అభిమానుల సంఘం ఆధ్వర్యంలో వృద్ధులకు పండ్లు, అన్నదానం అందజేసి అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నందమూరి కళ్యాణ్‌రామ్ సంఘం అధ్యక్షుడు ఉలిగప్ప, ఎం సందీప్, ఎంజీ సత్యనారాయణ, నాగప్ప, అప్పయ్య శంకర్, నరేష్, ఫొటో దుర్గ సుజిత్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.